మీ గళం.. మా కలం...!

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | గురువారం 29-10-2026 | సంపుటి: 15 | సంచిక: 139 | పేజీలు : 8 | వెల: 3/- |
|---|---|---|---|---|---|
| Rangareddy | TUESDAY 29-10-2026 | Volume: 15 | Issue : 139 | Page's: 8 | Rs: 3/- |

కొన్నింటిని ఓర్చుకో
కొందరిని చూసి నేర్చుకో
ఎంత మనవాళ్లు అనుకున్నా
ఎవరు ఏక్షణం ఎలా
మారిపోతారో
ఎవరికీ తెలియదు..!

## 'భారతీయ వ్యాపార సంస్థలు మోదీ, షా ఆటవస్తువులు కావు



**న్యూ ఢిల్లీ :** టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకం నేపథ్యంలో చెలరేగిన వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారతీయ వ్యాపార రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ ఆటవస్తువులా చూస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు ఈ విషయాలపై మాట్లాడటానికి భయపడుతున్నారని 'ఎక్స్' వేదికగా తెలిపారు.
"టాటా సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారు. అయినా ఒక్క వ్యాపారవేత్త కూడా దీనిపై మాట్లాడడానికి సాహసించడం లేదు. మీరు ఇంకెంత కాలం మౌనంగా ఉంటారు? వాళ్లు మిమ్మల్ని పూర్తిగా లొంగదీసుకునేంత వరకా? భారతీయ

మిగతా 2లో...

## ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యం



**హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** ఏఐతో ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యమని పేర్కొన్నారు. 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో భట్టి విక్రమార్క (బుధవారం) పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు కేటాయించాలని సూచించారు.రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకే 'ఏఐ సాక్షమ్'ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో, లేదో గుర్తించవచ్చని చెప్పుకొచ్చారు. విద్యుత్ డిమాండ్ అంచనా, పరికరాల లోపాల గుర్తింపులో ఏఐ కీలకంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు.ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో ఏఐతో సమయం ఆదా అవుతుందని భట్టి విక్రమార్క

మిగతా 2లో...

## సర్ పేరుతో ఓట్ల తొలగింపు

### కేంద్రంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణలు

**హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని సర్ పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓట్లను తొలగిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. ా×=పై రెండు సంవత్సరాల నుంచి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల తొలగింపు నిజమేనని తేటతెల్లం అయ్యిం దన్నారు. తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి. వారికి ఓటు హక్కు కల్పించాల ని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం నిద్రపోతున్నట్లు నటిస్తోందని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు.రైళ్లలో ప్రయాణం చేయడానికి అనుమతి అడుగుతుంటే కేంద్రం నుంచి అనుమతి రాలేదని మంత్రి తెలిపారు. గత పది రోజుల నుంచి ఇండియా కూటమిని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రైల్వే అంటే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సొత్తు కాదన్నారు. రైళ్లు, బోగీలు



మిగతా 2లో...

## నీటి నాణ్యతపై ఎక్కడా రాజీ పడవద్దు

- ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- హైద్రరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఎస్‌టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు.
- ఈ ప్లాంట్లపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని సీఎం ఆదేశించారు.

**హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** ట్రీటెడ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఏఐ వినియోగించాలన్న సీఎం రేవంత్ రెడ్డి నీటి నాణ్యతపై ఎక్కడా రాజీ



పడవద్దని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆ ర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలి యన్‌లో ఎస్ టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ప్రతి ప్లాంట్ వద్ద స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని, ఈ ప్లాంట్లపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్, ఇతర చోట్ల ల్యాండ్‌స్కేప్‌లు,

మిగతా 2లో...

## ఆర్నబ్ తుఫాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష..

- సీసీ కెమెరాలతో పరిస్థితుల పరిశీలన
- యంత్రాంగం పూర్తిగా అలర్ట్.

**అమరావతి, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** రాష్ట్రంలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై కీలక ఆదేశాలు ఇస్తున్నారు. తాజాగా సెక్రటేరియెట్‌లోని ఆర్టీజీఎస్ నుంచి సీసీ కెమెరాల ద్వారా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిని పరిశీలించారు. ఆర్నబ్ తుఫాన్ గమనాన్ని.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలోని పరిస్థితిని సీఎంకు ఆర్టీజీఎస్ అధికారులు వివరించారు. వివిధ ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడంతో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు



మిగతా 2లో...

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

### - కీలక శాఖలకు కొత్త అధికారులు




**హైదరాబాద్, అక్టోబర్ 28**
తెలంగాణ ప్రభుత్వం పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జయేష్ రంజన్‌కు పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ (జుఖీూ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించగా.. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ, ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడలు, హెరిటేజ్ తెలంగాణ బాధ్యతలు కేటాయించింది. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించగా, కె. ఇలంబర్తిను రవాణా శాఖ కార్యదర్శిగా నియమించిందిఇతర మార్పుల్లో భాగంగా సర్ఫరాజ్ అహ్మద్‌కు జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. శృతి ఓజాకు మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు,

మిగతా 2లో...

## కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ

- తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు
- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్



**హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు.ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నా రు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసి ల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడు తున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవ డం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకో వాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వ కంగా విస్మరించా రా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు

మిగతా 2లో...

## కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం

### యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

**హైదరాబాద్ అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.
ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ

మిగతా 2లో...



## మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు అడ్డంకులా?..



**హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేయటాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కరవు రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం బుద్ధి చెప్పడం ఖాయమని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.'మూసీ

మిగతా 2లో...

## లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన బంజారాహిల్స్ ఎస్ఐ




**హైదరాబాద్ అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఓ కేసులో సహాయం చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్, ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, బుధవారం

మిగతా 2లో...

మీ గళం.. మా కలం..!

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD

తెలుగు దిన పత్రిక

RNI No: APTEL/2012/45237



(మొదటి పేజీ తరువాయి)

## 'భారతీయ వ్యాపార సంస్థలు

వ్యాపార రంగం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, కానీ మాకు ఉంది. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా మేము కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాం." అని రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.

## ప్రజల జీవితాల్లో మార్పు

తెలిపారు. ఏఐ ఇచ్చే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధా న్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఏఐ నిర్ణయా లపై పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు.

## సర్ పేరుతో ఓట్ల తొలగింపు

ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ఒక్కొక్కటి బయట పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## నీటి నాణ్యతపై ఎక్కడా

రోడ్ క్లీనింగ్‌కు ట్రీటెడ్ వాటరే వాడాలని, సెక్రటేరియట్, సీఎంవో, పబ్లిక్ పార్కుల్లో ట్రీటెడ్ వాటర్ వినియోగించాలని సూచించారు. రైల్వే, మెట్రో రైల్‌ను ఈ పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు.
ప్రభుత్వ కార్యాలయాల్లో వంద శాతం ట్రీటెడ్ వాటర్ వాడాల్సిందేనని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్ ట్యాంకర్లను ట్రాక్ చేయాలని, ట్రీటెడ్ వాటర్ కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, ట్రీటెడ్ వాటర్‌నే వాడాలని భవన అనుమతుల్లోనే నిబంధన విధించాలని తెలిపారు. ట్రీటెడ్ వాటర్ ప్లాంట్లను సోలార్‌తో నడిపే అవకాశాలను పరిశీలించాలని, ప్రైవేట్ ఎస్‌టీపీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

## ఆర్నబ్ తుఫాన్‌పై

తలెత్తాయా అని సీఎం.. అధికారులను అడిగి తెలుసుకున్నారు.జాతీయ రహదా రులతో పాటు ఇతర చోట్ల ఏమైనా చెట్లు విరిగిపడితే వెంటనే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని సీఎం సూచించారు. తుఫాన్ హెచ్చరికలు వచ్చినప్పట్నుంచి ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ వివరించారు. మనమిత్ర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేయడంతో పాటు సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు.ఆర్నబ్ తుఫాన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. రాత్రి నుంచి ఉదయం వరకు అధికారులు, యంత్రాంగంతో మాట్లాడుతూ సమీక్ష నిర్వహించారు. ప్రజల ఇబ్బందులను తొలగించేలా క్షేత్ర స్థాయిలో యంత్రాంగాన్ని ప్రభుత్వం సమాయత్తం చేసింది. స్వయంగా సీఎం చంద్రబాబు.. మండల, గ్రామ స్థాయి సిబ్బందితో మాట్లాడుతుండడంతో యంత్రాంగం పూర్తిగా అలర్ట్ అయ్యింది. సిబ్బంది.. రాత్రి నుంచి రోడ్లపై ఉండి తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కూలిన చెట్లు తొలగింపు ప్రక్రియను విద్యుత్ శాఖ సిబ్బంది రియల్ టైంలో చేపట్టారు. తుఫాన్ నష్టం ఎక్కువ ఉండే ప్రాంతంలో ముందుగానే విద్యుత్ స్థంభాలు, సామగ్రిని అధికారులు సిద్ధం చేసుకున్నారు. భారీ వర్షంలో కూడా రోడ్లపై నిలబడి సహాయ చర్యల్లో అధికార యంత్రాంగం పాల్గొంటోంది. వాట్సాప్, సోషల్ మీడియా, మీడియా, కంట్రోల్ రూంలకు వస్తున్న సమాచారంపై, ఫిర్యాదులపై ఆయా శాఖల సిబ్బంది వెంటనే స్పందిస్తోంది. ప్రభుత్వ సత్వర స్పందనతో విద్యుత్ పునరుద్ధరణ, చెట్ల తొలగింపు వంటి అంశాల్లో ప్రజలకు కొంత మేర ఉపశమనం లభించింది. మంత్రులు.. ఆయా ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

## కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం

పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

## మూసీ ప్రజాభిప్రాయ

ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తున్నాను. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటు. మీ నిర్లక్ష్యం వల్ల కరవు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదు కోవడం మానేసి.. మూసీ ప్రక్షాళన పేరు తో రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తా మంటారా? కమిషన్ల దండుకోవడంపై ఉన్న శ్రద్ధ.. కరువు బాధిత రైతులను ఆదుకోవడంలో లేకపోవడం శోచనీయం. ఒక వైపు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, మరోవైపు పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు ఎంతకాలం నొక్కుతారు? ఎన్ని రోజులు అణచివేస్తారు? తెలంగాణ సమాజం మీకు తప్పక బుద్ధి చెబుతుంది. మూసీ ప్రక్షాళన పేరుతో జరుగుతున్న లూటీఫికేషన్ ప్రయత్నాలను తిప్పికొడుతుంది! అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలని మా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

### లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన

ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐ విజయ్‌ను పట్టుకున్నారు.పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు వెంటనే ఎస్ఐ విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తమ కార్యాలయానికి తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర

మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## తెలంగాణలో భారీగా...




వృద్ధుల సంక్షేమ శాఖల బాధ్యతలు కేటాయించారు. ముషర్రఫ్ అలీ ఫారూఖీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించగా, డాక్టర్ సంగీత సత్యనారాయణను మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. జితేష్ వి. పాటిల్‌కు టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఆర్ఈడీసీఓ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేరుతో ఉత్తర్వులు విడుదలయ్యాయి.

# జెండా ఎగరేస్తే జైలుకా?



జాతీయ జెండా ఎగరేస్తే జైలుకు పంపే దేశంలో ఇప్పుడు మనమున్నామా? ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నిర్బంధం ఈ ప్రశ్నను మరోసారి ముందుకు తెచ్చింది. అయితే వారిని కేవలం జాతీయ జెండా ఎగురవేసినందుకే నిర్బంధించారని చెప్పడం సరైనది కాదు. అనుమతి లేని ప్రవేశం, గతంలో ఇచ్చిన శాంతిభద్రతల హామీల ఉల్లంఘన, మళ్లీ అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశాల వంటి ఆరోపణలను అధికారులు ప్రస్తావించారు. అక్టోబర్ 14న వారిని ఐదు రోజుల నిర్బంధానికి పంపగా, అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. అక్టోబర్ 21న, జంతర్ మంతర్‌కు తిరిగి అధికారిక నిరసన స్థల హోదా లభించే వరకు అక్కడ నిరసనలకు పిలుపునివ్వబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిన అనంతరం విడుదల చేసినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలను ఇద్దరు కార్యకర్తల అరెస్టు, విడుదలగా మాత్రమే చూడలేం. నిరసన హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణ, జాతీయ జెండా గౌరవం మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించాల్సిన సందర్భమిది.జంతర్ మంతర్: ప్రజల గొంతుక దశాబ్దాలుగా రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వివిధ ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికగా నిలిచింది. పార్లమెంటుకు సమీపంలో ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే ముఖ్యమైన ప్రదేశమది. నిరసనలకు ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదని చెప్పలేం. స్థానిక ప్రజల హక్కులు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని నియంత్రణలు విధించవచ్చు. కానీ నిరసనలకు సరైన, న్యాయబద్ధమైన ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలి. ఏదో తూ తూ మంత్రంగా చూపించామని చెబితే సరిపోదు. అక్కడ నిరసన తెలిపే ప్రజల గొంతు మీడియాకు, పాలకులకు చేరే అవకాశం ఉందా అన్నదే ముఖ్యం. 2018లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ కేసులో సుప్రీంకోర్టు శాంతియుత నిరసన హక్కును గుర్తిస్తూనే, ఇతరుల హక్కులు, ప్రజల శాంతిని కాపాడేందుకు తగిన నియంత్రణలు అవసరమని స్పష్టం చేసింది.జెండా ఎగరేయడం నేరమా? రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం భావప్రకటనా స్వేచ్ఛను, 19(1) (బి) అధికరణం శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశమయ్యే హక్కును కల్పిస్తున్నాయి. ఈ హక్కులు సహేతుకమైన రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉంటాయి. 2004లో భారత ప్రభుత్వం వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో సుప్రీం కోర్టు గౌరవప్రదంగా జాతీయ జెండాను ఎగురవేయడం భావప్రకటనా స్వేచ్ఛలో భాగమని గుర్తించింది. అదే సమయంలో, జాతీయ గౌరవ అవమాన నిరోధక చట్టం -1971లోని సెక్షన్ 2 జాతీయ పతాకాన్ని నిర్దిష్ట విధాలుగా అవమానించే చర్యలను శిక్షార్హంగా పరిగణిస్తుంది. అయితే ప్రభుత్వ విధానాలను విమర్శించడం, జెండాను అవమానించడం రెండూ ఒకటి కావు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, ఈ ఇద్దరిపై జాతీయ గౌరవ చట్టం కింద ప్రత్యేక అభియోగం నమోదైనట్లు నిర్ధారణ కాలేదు. అందువల్ల వారిని జెండా అవమానించినందుకు నిర్బంధించారని చెప్పడం తగదు.అయితే, ఈ కేసులో అధికారుల వాదనలను విస్మరించలేం. చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంది. కానీ తీసుకున్న చర్య అవసరమైనదా? ఐదు రోజుల నిర్బంధం తప్పనిసరైందా? తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు అవసరం. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపేనని నిర్ధారించడానికి ఆధారాలు కావాలి. అదే సమయంలో చర్యల సముచితతను ప్రశ్నించడం ప్రజాస్వామిక హక్కు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి; రాజకీయ అభిప్రాయాల ఆధారంగా దాని అమలులో తేడాలు ఉండకూడదు.భారత స్వాతంత్ర్య పోరాటంలో త్రివర్ణ పతాకం వలస పాలనపై అసమ్మతికి, స్వయం పాలన ఆకాంక్షకు ప్రతీకగా నిలిచింది. ఆ చరిత్రను గుర్తు చేసుకోవడం అంటే నేటి పాలనను బ్రిటిష్ పాలనతో సమానంగా చూడడం కాదు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల విలువను గుర్తించడం. దేశభక్తి అంటే ప్రభుత్వ నిర్ణయాలన్నింటినీ అంగీకరించడం కాదు. దేశాన్ని ప్రేమిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు. జాతీయ జెండాను గౌరవిస్తూ పాలకుల విధానాలను విమర్శించవచ్చు. చట్టాన్ని గౌరవిస్తూనే దాని అమలులోని లోపాలను ప్రశ్నించవచ్చు. జెండా ప్రజలది. రాజ్యాంగం ప్రజలది. దేశం కూడా ప్రజలదే. నిరసనలకు చట్టబద్ధమైన పరిమితులు ఉండవచ్చు. కానీ ఆ పరిమితులు ప్రజల గొంతును మూయడానికి సాధనాలుగా మారకూడదు. జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంతోపాటు, అది ప్రతిబింబించే స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌర గౌరవాన్ని పరిరక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. అదే త్రివర్ణ పతాకం మనకు అందించే అసలు సిసలైన సందేశం!

# లూలా విదేశాంగ విధానానికి ప్రజామోదం



లాటిన్ అమెరికాలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన బ్రెజిల్‌లో వామపక్ష నేత లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా మరోసారి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఆదివారం జరిగిన తుది విడత అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారో కుమారుడు, ట్రంప్ మద్దతుదారు ఫ్లావియో బొల్సొనారోపై విజయం సాధించారు. నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి బ్రెజిల్ నేతగా ఆయన చరిత్ర సృష్టించారు. ఈ విజయం కేవలం లూలా వ్యక్తిగత విజయంగా చూడటం సరికాదు. బొల్సొనారో కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి బ్రెజిల్ ఓటర్లు వేసిన అడ్డుకట్టగా దీన్ని చూడాలి. పెరుగుతున్న జీవన వ్యయం, నేరాలు వంటి అంశాలు లూలాకు ఇబ్బంది కలిగించినప్పటికీ.. ప్రజాస్వామ్య పరిరక్షణ, సంక్షేమ పథకాలు, పేదల ప్రయోజనాలు, సామాజిక న్యాయం వంటి అంశాలతో ఆయన ఓటర్లను తనవైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా ఈశాన్య బ్రెజిల్‌లో లూలాకు బలమైన మద్దతు లభించింది. లూలా రాజకీయ ప్రస్థానం సాధారణమైనది కాదు. కార్మికుడిగా, యూనియన్ నాయకుడిగా ఎదిగి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2003- 2010 మధ్య రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేశారు.ఆ కాలంలో వస్తు ఎగుమతులపై వచ్చిన ఆదాయాన్ని సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించి కోట్లాది మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లడం, ఆ తర్వాత ఆ కేసులకు సంబంధించి శిక్షలు రద్దు కావడం, 2022లో బొల్సొనారోను ఓడించి తిరిగి అధికారంలోకి రావడం ఆయన రాజకీయ జీవితంలో చెప్పుకోదగిన మలుపులు. ఇప్పుడు నాలుగోసారి ప్రజలు ఆయనకే పట్టం కట్టడం బ్రెజిల్ రాజకీయాల్లో ఆయనకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని తెలియజేస్తోంది. అయితే లూలా ముందున్న అతిపెద్ద సవాళ్లలో అమెరికాతో సంబంధాలు ఒకటి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలతో బ్రెజిల్ -అమెరికా సంబంధాలు ఇటీవలి కాలంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారోపై తీసుకున్న న్యాయపరమైన చర్యలను అమెరికా ప్రభుత్వం ప్రశ్నించడం, బ్రెజిల్ ఉత్పత్తులపై భారీ సుంకాలు విధించడం, బ్రెజిల్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యానికి ప్రయత్నిస్తోందన్న భావన లూలా ప్రభుత్వంలో బలపడటం ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. అమెరికా విధించిన సుంకాలను లూలా అన్యాయమైనవిగా అభివర్ణించినప్పటికీ, ప్రతీకార చర్యల కంటే చర్చల ద్వారానే సమస్య పరిష్కరించుకోవాలని ఆయన ఇప్పటివరకు ప్రయత్నించారు. అమెరికా విషయంలో లూలా వైఖరి ఘర్షణను కోరుకునేదిగా కాకుండా బ్రెజిల్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని కొనసాగించాలన్నదిగా కనిపిస్తోంది. చైనా బ్రెజిల్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండటం, అమెరికా కూడా కీలక భాగస్వామి కావడంతో ఏ ఒక్క శిబిరంలోనూ పూర్తిగా చేరకుండా బహుళ ధ్రువ ప్రపంచాన్ని ప్రోత్సహించడం లూలా విదేశాంగ విధానంలో ముఖ్యాంశం.బ్రిక్స్, గ్లోబల్ సౌత్ వేదికలను బలోపేతం చేయాలన్న ఆయన ప్రయత్నం కూడా ఇందులో భాగమే. లూలా గెలుపుతో బ్రెజిల్‌తో భారత్ బంధం మరింత బలోపేతమవుతుందని చెప్పవచ్చు. భారత్ బ్రెజిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం 2006లోనే ప్రారంభమైంది. బ్రిక్స్, ఐబీఎస్ఎ, జీ-20, ప్రపంచ వాణిజ్య సంస్థ తదితర వేదికలపై ఇరు దేశాలూ కలిసి పనిచేస్తున్నాయి. 2025లో ప్రధాని మోడీ బ్రెజిల్‌లో పర్యటించగా, 2026 ఫిబ్రవరిలో లూలా భారత్‌లో పర్యటించడం ద్వైపాక్షిక సంబంధాలకు లభిస్తున్న ప్రాధాన్యాన్ని వెల్లడిస్తోంది. ఈ సందర్భంగా కీలక ఖనిజాలు, డిజిటల్ భాగస్వామ్యం, ఔషధాలు, వ్యవసాయం, ఇంధనం, ఎంఎస్ఎంఇలు తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇరుదేశాల వాణిజ్యం కూడా వేగంగా పెరుగుతోంది. 2025లో భారత్ -బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్యం 15.21 బిలియన్ డాలర్లకు చేరింది.2030 నాటికి 30 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని ఇరుదేశాలు నిర్దేశించుకున్నా యి. లూలా నాలుగోసారి గెలిచినంతమాత్రాన దేశంలో రాజకీయంగా ఆయనకు ఎదురులేదని అనుకోవడం పొరబాటే. ఎన్నికల విజయాన్ని సుస్థిర పాలనగా మార్చడం ఆయనకు పెద్ద పరీక్ష. అమెరికాతో సంబంధాలను తెంచుకోకుండా, బ్రెజిల్ ప్రయోజనాలను కాపాడటం, చైనా, భారత్ సహా గ్లోబల్ సౌత్‌తో బంధాలను బలోపేతం చేయడం, అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, ద్రవ్యోల్బణం, నేరాల సమస్యలను పరిష్కరించడం ఆయన ముందున్న ప్రధాన కర్తవ్యాలు. ఎన్నికల్లో గెలుపు ఆయనకు కేవలం మరో పదవీకాలం కాదు.. బ్రెజిల్ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, ప్రజాస్వామ్య సంస్థలను, సామాజిక న్యాయాన్ని కాపాడే బాధ్యతను మరోసారి అప్పగిస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పు. ఆ తీర్పును ఎంత సమర్థంగా అమలు చేస్తారన్నదే లూలా విజయానికి అసలు సిసలైన కొలమానం.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం...!
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237



# ముర్షద్ గడ్డలో కుక్కల బెడద

- ఇటీవల పలువురు చిన్నారులను గాయపరిచిన కుక్కలు
- బయటకు రావాలంటేనే జంకుతున్న వృద్ధులు, పిల్లలు
- పట్టించుకోని పొలిటికల్ లీడర్స్
- కుక్కల బారి నుండి కాపాడాలని కోరుతున్న స్థానికులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో గల ముర్షద్ గడ్డ 28వ వార్డులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎప్పుడు చూసినా 20 నుంచి 30 కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలువురు చిన్నారులను కుక్కలు గాయపరిచాయి. చిన్నారుల కుటుంబీకులు వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆంటీ రేబిస్ ఇంజక్షన్లను వివిధ డోసులను వేయించారు. కుక్కల గుంపులను చూసి వృద్ధులు, చిన్నారులు ఇండ్లలో నుండి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల కొన్నిచోట్ల కుక్కలు ఇండ్లలోకి సైతం చొరబడి భయపెడుతున్నాయి. వివిధ పార్టీల రాజకీయ నాయకులకు వారి రాజకీయాలు తప్ప స్థానికంగా ఉన్న కుక్కల బెడద కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వార్డులోని గల్లీలలో పరిశీలిస్తే మనుషులు, చిన్న పిల్లల కంటే కుక్కలే ఎక్కువగా కనిపిస్తున్నాయని వాపోతున్నారు. ప్రతీరోజు ఉదయం సాయంత్రం అనే తేడా లేకుండా కుక్కలు వాహనదారులను, పాదచారులను అడ్డుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, ఈ ప్రాంతంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఉన్నారని, కుక్కలు ఎప్పుడు ఎవరిని కరుస్తాయో అని భయంగా ఉందని, కుక్కలు ఎవ రిని గాయపరచక ముందే దయచేసి వివిధ పార్టీల పొలి టికల్ లీడర్లు తమ రాజకీయాలను పక్కన పెట్టి సంబంధిత శాఖ అధికారుల ద్వారా కుక్కలను నియంత్రించేందుకు కృషిచేసి స్థాని క ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెంచుకోవాలని కోరుతున్నారు.

## హైదరాబాద్ జిల్లా రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొట్టే శ్యామ్ రావు

--- శ్యామ్ రావును ఘనంగా సత్కరించిన తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



**హైదరాబాద్, అక్టోబర్ 28 ( నమస్తే హైదరాబాద్):**
హైదరాబాద్ జిల్లా తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన కొట్టే శ్యామ్ రావును ఘనంగా సత్కరించారు. బుధవారం తార్నాకలో నిర్వహించిన రియల్టర్స్ సమావేశంలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. నరసయ్య శ్యామ్ రావుకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసి, రియల్టర్ల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అసోసియేషన్‌ను పటిష్టమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రియల్టర్లు కే. వెంకటేశ్వర్లు, మొహమ్మద్ ఈసా, మోహన్, జయపాల్ రెడ్డి, కోలా బాబురావు, బిక్షపతి, ఎం. నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై రాజకీయాలా.. రైతులకు భరోసా ఏదీ..

- రైతులను గందరగోళానికి గురిచేయొద్దు
- కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- రైతు వేదికలో సబ్సిడీ విత్తనాల పంపిణీ

ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్




**చిన్నకోడూరు, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):**
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన కలిగించేలా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని చిన్నకోడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ అన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాల్సిన సమయంలో రాజకీయ విమర్శలతో వారిని గందరగోళానికి గురిచేయొద్దని ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు. రైతులను అప్రమత్తం చేయడం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడం, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రైతులకు సబ్సిడీపై పొద్దుతిరుగుడు, కంది, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయ రంగంపై దాని ప్రభావం గురించి ఆయన మాట్లాడారు.

### విపత్తుల సమయంలో రాజకీయాలు తగవు

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించినట్లుగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడటం సరికాదని మహేందర్ యాదవ్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా మహమ్మారి సమయంలో ప్రజలకు అవగాహన కల్పించిన తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. విపత్తుల సమయంలో ప్రజలకు భరోసా కల్పించడం, వాస్తవ పరిస్థితులను వివరించడం ప్రభుత్వాలతో పాటు ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు ఏ విధమైన పంటలు అనుకూలంగా ఉంటాయి.. నీటి లభ్యతను బట్టి ఎలాంటి సాగు పద్ధతులు అనుసరించాలి.. అనే అంశాలపై అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలని సూచించారు.

### రైతులను అప్రమత్తం చేస్తున్న ప్రభుత్వం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాల స్థాయిలో ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టినట్లు మహేందర్ యాదవ్ తెలిపారు. కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని, నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. పంటల ఎంపికలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

### రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మహేందర్ యాదవ్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని పేర్కొన్నారు. రైతులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జయంత్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల రాజేష్, గొట్టిపర్తి చందు, గోపు హరిబాబు, పంతం శ్రీనివాస్, మాచాపూర్ సర్పంచ్ యాట సత్యలక్ష్మి యాదయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# చర్లపల్లికి పి హెచ్ సి మంజూరు చేయాలి

మేడ్చల్ డి ఎం హెచ్ ఓ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్ (నమస్తే హైదరాబాద్):** చర్లపల్లి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి హెచ్ సి మంజూరు చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి ఎం హెచ్ ఓ ఆనంద్ గారిని కలిశారు. ఈ సందర్భంగా చర్లపల్లి ప్రాంతంలో పి హెచ్ సి ఏర్పాటు ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించారు. స్థానిక ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావడంతో పాటు, అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి పి హెచ్ సి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన డి ఎం హెచ్ ఓ త్వరలోనే చర్లపల్లి ప్రాంతాన్ని సందర్శించి, పి హెచ్ సి ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అవసరమైన వివరాలను సేకరిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.?

# ఉష్ణమండల వ్యాధుల నివారణకు ఉమ్మడి కృషి అవశ్యం: డాక్టర్ అహ్మద్





**పఠాన్ చెరు /నమస్తే హైదరాబాద్ అక్టోబర్ 28:=**
నిర్లక్ష్యం చేయబడిన ఉష్ణమండల వ్యాధులను ఎదుర్కోవాలంటే శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సామాజిక పరిశోధకులు కలిసి పనిచేయాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, జీవశాస్త్రాల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ స్పష్టీకరించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) యొక్క సంస్థాగత పరిశోధన కమిటీ, తన పరిశోధన సదస్సుల శ్రేణిలో భాగంగా ఎనిమిదవ సెమినార్ ను బుధవారం నిర్వహించింది. 'వేడెక్కుతున్న ప్రపంచం కోసం వ్యాక్సిన్ ల రూపకల్పన: డెంగ్యూపై పోరాటంలో విజ్ఞానం, సమానత్వం, విధానం' అనే శీర్షికన దీనిని ఏర్పాటు చేశారు. డాక్టర్ అహ్మద్, డెంగ్యూ వ్యాప్తిపై వాతావరణ మార్పులు, పర్యావరణ కారకాల ప్రభావాన్ని వివరిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డెంగ్యూ ముప్పు గురించి చర్చించారు. వ్యాక్సిన్ ఆవిష్కర్తలుగా తమ ప్రయోగశాల ఈ సమస్యను ఎలా పరిష్కరించిందో ఆయన వివరించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రాథమిక, ప్రీ-క్లినికల్ దశలో ఉన్నప్పటికీ, ఈ రంగాన్ని వెనక్కి నెట్టిన భద్రత, సమర్థతకు సంబంధించిన రాజీలను, మరింత తెలివైన వ్యాక్సిన్ రూపకల్పన ద్వారా పరిష్కరించవచ్చని ఇవి చూపిస్తున్నాయన్నారు. పలువురు అధ్యాపకులు ఈ చర్చలో చురుకుగా పాల్గొని, పలు సందేహాలపై వివరణలు కోరడంతో పాటు డాక్టర్ అహ్మద్ పరిశోధనా నైపుణ్యాన్ని, స్పష్టమైన వివరణను ప్రశంసించారు.

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఇర్షాద్ ఖాన్

--- ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్ష



**ఉప్పల్, అక్టోబర్ 28 ( నమస్తే హైదరాబాద్):**
తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బీరప్పగడ్డ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ వ్యక్తిగతంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మరింతగా సేవలందించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. తాను గాడ్‌ఫాదర్‌గా భావించే పొంగులేటి శ్రీనివాస రెడ్డి పట్ల తనకున్న గౌరవం, అభిమానం, ఆత్మీయతను ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ వ్యక్తం చేశారు. మంత్రి ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# తాగునీటితో ఇంటి ప్రాంగణం శుభ్రం - రూ.5 వేల జరిమానా విధించిన జలమండలి

**హైదరాబాద్:** ల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. దీంతో జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీటి మట్టం అట్టడుగున ఉంది. చాలా ప్రాంతాల్లో జలవనరులు పూర్తి గా ఎండిపోయిన పరిస్థితి నెలకొంది. దీంతో రానున్న కాలం గడ్డు పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమ వుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్? జలమండలి నీటి వృథాపై కఠినంగా వ్యవహరిస్తోంది. నీటిని వృథా చేసిన వారికి భారీగా జరిమానాలను విధిస్తోంది. నీటి సరఫరా ట్యాంకుల లీకేజీలపైనా అధికారులను అప్రమత్తం చేసింది. హైదరాబాద్? నగరంలో నీటిని సక్రమంగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పిస్తోంది. నగర వ్యాప్తంగా నీటి వృథాకు సంబంధించిన ఫిర్యాదులను తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరుతోంది. దీంతో తాగునీటి దుర్వినియోగంపై జలమండలికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వాట్సప్ ద్వారా అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీటి దుర్వినియోగమవుతున్నట్లు నిర్ధారిస్తున్న అధికారులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. రూ.5 వేల జరిమానారెండు రోజుల కిందట ఖైరతాబాద్?లోని ఓ ప్రముఖ హోటల్‌కు రూ.20 వేల జరిమానా విధించారు. ఈ ఘటన మరువక ముందే మరొకరికి జరిమానా విధించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో పరిధిలోని రోడ్ నంబర్? 57లో ఓ నివాసంలో తాగునీటితో ఇంటి ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్నట్లు జలమండలికి వాట్సప్ ద్వారా ఫిర్యాదు అందింది. ఆ ఇంటిని పరిశీలించిన అధికారులు యజమానికి రూ.5 వేల జరిమానా విధించారు. ఇంటి ఆవరణ, రోడ్లు శుభ్రపరిచేందుకు తాగునీటిని వృథా చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నంబర్?లకు సమాచారం ఇవ్వండితాగునీటి వృథా, దుర్వినియోగం ఘటనలు ఎక్కడైనా ప్రజల దృష్టికి వస్తే సంబంధిత ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ఘటన జరిగిన ప్రాంతం, పూర్తి చిరునామా చేయవచ్చని జలమండలి తెలిపింది. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిశీలించి, అవసరమైన క్షేత్రస్థాయి విచారణ చేపడతామని, ఉల్లంఘనలు నిర్ధారణ జరిగితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జలమండలి స్పష్టం చేసింది. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను పూర్తి గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

నమస్తే హైదరాబాద్
మీ గళం.. మా కలం..!
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237


## ఆ రహదారిపై మరణఘోష - నిర్మాణ లోపాలతో ఏటా 370 మంది మృత్యువాత



**హైదరాబాద్:** అతి వేగం ప్రమాదకరం అని తెలిసినా కొందరు వాహనదారులు రూల్స్ పాటించడం లేదు. రోడ్డు ప్రమాద బాధితులై కుటుంబాలను ఇబ్బందుల పాల్జేస్తున్నారు. తక్కువ సమయంలో గమ్యాన్ని చేరాలన్న తొందరలో నిబంధనలకు విరుద్ధంగా వేగంగా వాహనాన్ని నడుపుతున్నారు కొందరు. మరోవైపు రహదారుల నిర్మాణ లోపాలు, నిర్వహణ కొరవడంతో నిత్యం రహదారిపై ఏదో ఒక చోట మృత్యుఘోష వినాల్సి వస్తోంది.ఉత్తర తెలంగాణ జిల్లాలను హైదరాబాద్?కి అనుసంధానం చేయడంతో కీలకంగా ఉన్న రాజీవ్? రహదారి ఎన్‌హెచ్1 మృత్యు మార్గంగా మారుతోంది. ఈ రహదారిపై ఏటా సగటున 370 మంది విగతజీవులవుతున్నారు. 550 మందికిపైగా గాయపడుతున్నారు.ఈ రహదారిపై ఏర్పాటు చేసిన శాసనమండలి సభాసంఘం సిఫార్సులూ బుట్టదాఖలయ్యాయి. ఎన్?హెచ్?ఏఐ రహదారిగా మార్చడానికి కేంద్రానికి అందించిన విజ్ఞప్తులూ అమలు కాలేదు. రోడ్డు పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాల్సిన రాష్ట్ర-రోడ్ల భవనాల శాఖకు ప్రమాదాలపై పట్టింపు లేదు. నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సిన కాంట్రాక్టర్? సంస్థ కేవలం నామమాత్రపు పనులతోనే నెట్టుకొస్తోంది. ఈ కారణంగా రాజీవ్? రహదారిపై వాహనదారులు భయం గుప్పిట్లోనే రాకపోకలు సాగిస్తున్నారు.పీపీపీ పద్ధతిలో హైవే నిర్మాణంరోడ్లు-భవనాల శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ (పీపీపీ) పద్ధతిలో సర్కార్? 2007 లో రూ.1,358.19 కోట్లతో బీవోటీ పద్ధతిలో నాలుగు వరుసలతో 206.178 కి.మీ మేర హైవేను నిర్మించింది. అది హైదరాబాద్ ఔటర్? రింగ్ రోడ్డు సమీపంలోని శామీర్?పేట నుంచి సిద్దిపేట, కరీంనగర్?, పెద్దపల్లి జిల్లాల మీదుగా మంచిర్యాల జిల్లాలోని అందారం వరకు ఉంది. 2014లో ప్రారంభం కాగా మూడు టోల్? ప్లాజాల ద్వారా నిత్యం సుమారు రూ.25-28 లక్షల వరకు రుసుం వస్తోంది. 2036 వరకు నిర్వహణ బాధ్యత గుత్తేదారు సంస్థనే చూసుకోవాలి.రహదారి నిర్మాణం సమయంలోనే డిజైన్?లురాజీవ్? రహదారి నిర్మాణ సమయంలోనే డిజైన్?, అక్రమాలపై ఆరోపణలు రావడంతో 2012లో శాసనమండలి సభాసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఎక్కడెక్కడ ఏం పనులు చేయాలి? బైపాస్? అవసరం ఎక్కడ ఉంది? డిజైనులో మార్పులు, నిర్వహణపై పలు సిఫార్సులను చేశారు. కానీ కేవలం మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో బీఆర్?ఎస్? ఈ రహదారిని ఎన్?హెచ్?ఏఐకు ప్రతిపాదిస్తూ అభివృద్ధి చేయాలని కోరింది. తమకు ఆ ఉద్దేశం లేదని ఇప్పటికే కేంద్రం సమాచారం ఇచ్చినట్లు పేర్కొంది.హైదరాబాద్, వరంగల్‌నుంచి వచ్చే వాహనాలు కరీంనగర్?లోకి ప్రవేశించే ప్రధాన కూడలి అలుగునూరు. ఇక్కడే రోడ్డు మలుపులు వాహనదారులను తికమక చేస్తోంది. అక్కడ మార్గాలపై కావాల్సిన డివైడర్లు, మలుపులు సూచించే బోర్డులు లేవు. దీంతో వాహనాలు అకస్మాత్తుగా మలుపు తీసుకోవాల్సి వస్తోంది. అంతేకాదు రాత్రి వేళ కనీసం వీధి దీపాలు కూడా వెలగవు.బసంత్?నగర్?, రామగుండం ఆయిల్? కార్పొరేషన్?ల వద్ద, రేణికుంట టోల్? ప్లాజా బొమ్మకల్? శివార్లలో ట్రక్? బేలు లేనందున భారీ లారీలను రాత్రి వేళల్లో రోడ్డుపైనే నిలుపుతున్నారు.రహదారి పక్కన వెలిసిన హోటళ్లు, దాబాల యజమానాలు తమ వ్యాపారాల కోసం డివైడర్ల మధ్యనున్న ఇనుప రాడ్లను, రాళ్లను తొలగించి యూ-టర్న్?లు ఏర్పాటు చేసుకున్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాపై అర్నబ్ తుపాన్ ప్రభావం - అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**ఖమ్మం :** అర్నబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం పట్టణంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వాన కురుస్తోంది. భద్రాద్రి జిల్లా భద్రాచలం, ఇల్లందు, అశ్వరావుపేట, మణుగూరు మండలాల్లోనూ ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. తుపాను కారణంగా జిల్లాలో ఇవాళ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన కరెంటు తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు.సిబ్బంద సెలవులు రద్దువాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తుపాను నేపథ్యంలో జిల్లా అధికారులు, ఇతర సిబ్బందికి మంజూరు చేసిన సెలవులను రద్దు చేశారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరై, తమ హెడ్‌క్వార్టర్లలోనే అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్‌ను విడిచి వెళ్లరాదని ఆదేశించారు.తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. పాతబడిన గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.మంగళవారం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వానఅర్నాబ్? తుపాన్? కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా సాధారణ వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చలిగాలులతో మబ్బుగా ఉన్న వాతావరణం సాయంత్రానికి వర్షంగా మారింది. ఏకధాటిగా వర్షం కురుస్తూ వస్తోంది. ఒకవైపు వర్షం మరోవైపు గాలులు వీస్తుండటంతో జిల్లా కలెక్టల్? అంకిత్? జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అలాగే ప్రజలంతా తుపాన్? కారణంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ వర్షపాతం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులుమధిర నియోజకవర్గంలో ఎడతెరిపిలేని వాన కురుస్తోంది. అర్నబ్? తుపాను కారణంగా తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులతోపాటు వాన కురుస్తుండటంతో వాతావరణం చలిగా మారింది. దీంతో అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు వీధుల్లోకి రావడం లేదు. చెరువులు కుంటల్లోకి నీరు చేరి చెక్ డ్యాములపై నుంచి ప్రవహిస్తున్నాయి. తుపాను కారణంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అదేవిధంగా లోతట్టు ప్రాంత వాసులకు పునరావాస కేంద్రాలు సైతం సిద్ధం చేశారుతుపాను కారణంగా దెబ్బతిన్న పంటలుతుపాను కారణంగా పాలేరు నియోజకవర్గంలో కురుస్తున్న వర్షాలకు వరి, పత్తి, చెరకు పంటలు దెబ్బతిన్నాయి. ఎల్?నినో కారణంగా ఇప్పటికే వరి సాగు తగ్గింది. బావులు చెరువులు బోర్ల కింద అరకొరగా సాగు చేశారు. నీటి కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీగా పెట్టుబడి పెట్టి పండించిన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తుపాను కారణంగా కోసిన వరి ధాన్యాన్ని తార్పాలిన్లు కప్పి వర్షం నుంచి . ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ పార్టీ పోరాటం.

- **భగత్ సింగ్ నగర్ కాలనీ పట్టాలు రానివారికి వెంటనే ఇవ్వాలి**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**






**మేడిపల్లి (నమస్తే హైదరాబాద్)** :మేడిపల్లి మండలం, బోడుప్పల్ సర్కిల్, 10వ, డివిజన్ లో భగత్ సింగ్ నగర్ కాలనీ మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివ రావు గారు మరియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్ మరియు జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ హాజరవడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముందుగా సిపిఐ పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గారు ఎగరవేయడం జరిగినది. కాలనీ మొత్తం తిరిగి ప్రజల జీవన విధానాన్ని పరిశీలి ంచారు. కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారు కాలనీ వాసులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి, ప్రజలకు అవసరమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఇప్పటివరకు ఇంటి పట్టాలు పొందని అర్హులైన పేదలకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో చర్చించారు. పేద ప్రజల హక్కుల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, అర్హులైన నిరు పేదలకు న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని పార్టీ నాయకులు పేర్కొన్నా రు.ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం, కాలనీల సమ గ్ర అభివృద్ధి కోసం సీపీఐ పార్టీ నిరంతరం కృషి చేస్తుంది. ప్రభు త్వం స్పందించి భగత్ సింగ్ నగర్ కాలనీ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు , జె లక్ష్మి ,కే ధర్మేందర్, సత్య ప్రసాద్, సిపిఐ పార్టీ నాయకుల, వీబి బాలరాజ్, కావాలని నరసింహ, సిహెచ్ మాధవి, జి నాగరాజు, కే ప్రమీల, దండు రమేష్, ఈశ్వర్ , జై చంద్ర ,కే మహాలక్ష్మి, ఎండి అన్వర్, ఇస్తారి, సోమరాజు, కాంటెస్ట్ ఎమ్మెల్యే ముడి మార్టిన్, రామకృష్ణ, మొగులయ్య, యాద ిగిరి, కాలనీవాసులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలి

- **అర్హులైన పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ అందించాలి**
- **ఐదు జిల్లాల దత్తత కేసులపై సమీక్ష**




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):**
దత్తతకు అర్హులైన పిల్లలకు కుటుంబ ఆధారిత సంరక్షణ అందించేందుకు దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ జూనియర్ ప్రొఫెషనల్ లివియా మరియం పాల్, తెలంగాణ రాష్ట్ర దత్తత సేవా సంస్థ కార్యక్రమ నిర్వాహకురాలు సునీత అధికారులకు సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో దత్తత ప్రక్రియపై జిల్లాల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లివియా మరియం పాల్, సునీత సంయుక్తంగా పాల్గొని దత్తత కేసుల పురోగతిని సమీక్షించారు. సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదు జిల్లాల్లో దత్తత ప్రక్రియ అమలు తీరు, ప్రస్తుతం కొనసాగుతున్న కేసులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.

**అర్హులైన పిల్లల కేసులపై ప్రత్యేక దృష్టి**

బాలల సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న పిల్లల్లో చట్టపరమైన నిబంధనల ప్రకారం దత్తతకు అర్హులైన వారిని గుర్తించి, వారి దత్తత ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు సందర్శించని కేసులు, పిల్లల సంరక్షణకు తల్లిదండ్రులు అనర్హులుగా గుర్తించిన కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, చట్ట ప్రకారం అవసరమైన చర్యలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని తెలిపారు. దత్తతకు సంబంధించిన పత్రాల పరిశీలన, ధ్రువీకరణ, ఇతర చట్టపరమైన ప్రక్రియలను నిర్ణీత నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తూ పిల్లల భద్రత, సంక్షేమం, భవిష్యత్తు ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి కార్యాచరణ**

దత్తతకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణతోపాటు వారికి మెరుగైన భవిష్యత్తును అందించడంలో దత్తత ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన పిల్లలకు కుటుంబ వాతావరణంలో సంరక్షణ లభించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

## సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన తొలి జిల్లా కార్యాలయం

- **ఉచిత విద్య.. ఉచిత వైద్యం.. ప్రజల మేలు కోసం కవితమ్మ సంకల్పం**
- **నవంబర్ 13న కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా భూమిపూజ**
- **నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు అండగా నిలవాలి**
- **నిరుద్యోగం, నిర్వాసితుల సమస్యలు, వలసలపై పోరాటం**
- **ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి**
- **తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్)**
: తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతోందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత చేపట్టిన సంకల్పానికి ప్రజలంతా అండగా నిలవాలని నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లారం మల్లారెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్రంలోనే తొలి జిల్లా కార్యాలయ నిర్మాణానికి సిద్దిపేట వేదిక కానుంది. నవంబర్ 13న పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సిద్దిపేటలో పర్యటించి కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర వెల్లడించారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో చల్లారం మల్లారెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సామాజిక తెలంగాణే లక్ష్యం**

సామాజిక తెలంగాణ సాధనే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్తుందని లోక రవిచంద్ర తెలిపారు. సిద్దిపేట జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు.
నిరుద్యోగం, నిర్వాసితుల సమస్యలపై పోరాటం
గత బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగం, నిర్వాసితుల సమస్యలు, వలసలు పెరిగాయని లోక రవిచంద్ర విమర్శించారు. యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు సేకరించినప్పటికీ, కొన్ని పనులు పూర్తికాకపోవడం, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. చదువుకున్న యువత ఉపాధి కోసం అమెరికా వంటి దేశాలకు వెళ్తుండగా, మరికొందరు దుబాయ్‌కు వలస వెళ్తున్నారని అన్నారు. స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లేక కొందరు సిద్దిపేటలో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని, బాధితులకు అండగా నిలుస్తుందని తెలిపారు.

**ఇంద్రవెల్లి సభకు తరలిరావాలి**

ఈ నెల 30న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'పాంచజన్య సభ'కు సిద్దిపేట జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని లోక రవిచంద్ర పిలుపునిచ్చారు.

**లోక రవిచంద్రకు ఘన సన్మానం**

తెలంగాణ రక్షణ సేన సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన లోక రవిచంద్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్నే సంతోష్ రెడ్డి, పిట్ల వెంకటేష్, సరుగు కమలాకర్, ఎల్లం, శివరాత్రి శ్రీనివాస్, రాజు, అనిల్, ఖాదర్, గౌస్, షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మీ గళం.. మా కలం..!
నమస్తే హైదరాబాద్
NAMASTHE HYDERABAD తెలుగు దిన పత్రిక RNI No: APTEL/2012/45237



# శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు ఎన్. నర్సిరెడ్డి, ప్రముఖులు





**హైదరాబాద్, అక్టోబర్ 28 ( నమస్తే హైదరాబాద్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో సహస్ర దీపాలంకార సేవ భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు ఎన్. నర్సిరెడ్డి, డైరెక్టర్ త్రినాథరావు, గడ్డం రవికుమార్, రైటర్ శ్రీనివాస్ పాల్గొని శ్రీవారి సేవలో భాగస్వాములయ్యారు. తిరుమలలో భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని మరింత పెంపొందించే సహస్ర దీపాలంకార సేవలో భాగంగా వెలిగించిన దీపాల కాంతులు ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణాన్ని నింపాయి. శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటూ, భక్తిప్రపత్తులతో నిర్వహించిన ఈ సేవలో పాల్గొన్న ప్రముఖులు స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి సన్నిధిలో పవిత్రమైన సహస్ర దీపాలంకార సేవలో పాల్గొనడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. తిరుమల క్షేత్రంలో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

# సామజిక బాధ్యత తో యువత ముందుకు సాగాలి..

**రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ**






**పఠాన్ చెరు /నమస్తే హైదరాబాద్ అక్టోబర్ 28:** సామజిక బాధ్యత తో యువత ముందుకు సాగాలని రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం జిన్నారం వచ్చిన అయనను యువజన సంఘాల సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా తహసీల్దార్ ను కలిసి యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన సంఘాల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఆది రామకృష్ణ, జిన్నారం గ్రామానికి చెందిన యువజన నాయకుడు పుట్టి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యువజన సంఘాల సమితి కమిటీలను ఏర్పాటు చేస్తూ యువతను సామాజిక సేవా కార్యక్రమాల వైపు నడిపించడం అభినందనీయమన్నారు. యువజన సంఘాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి యువతను సంఘటితం చేయడంలో రాష్ట్ర అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ పేదలకు సహాయం, విద్యార్థులకు చేయూత, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. జిల్లాలో యువజన సంఘాల సమితిని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రస్థాయి నాయకత్వం సహకరించాలని కోరారు. జిల్లాలోని యువతకు సమితిలో బాధ్యతలు అప్పగించి, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ఆది రామకృష్ణ, పుట్టి భాస్కర్, పోచమ్మల స్వామి,సాయి రెడ్డి , భూమయ్య ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు చేతివృత్తుల్లోనూ నైపుణ్యం సాధించాలి

- ఆర్టిఫిషియల్ ఆభరణాల తయారీలో శిక్షణ.. విద్యార్థినులకు ధ్రువపత్రాల ప్రదానం..
- జూట్ సంచుల తయారీ, పుట్టగొడుగుల పెంపకంలోనూ శిక్షణ




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీవన్ కుమార్ విద్యార్థినులకు సూచించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్ఈటీఐ) ద్వారా ఆర్టిఫిషియల్ ఆభరణాల తయారీలో శిక్షణ పూర్తి చేసుకొని ధ్రువపత్రాలు పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణలు విద్యార్థినులకు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలతో పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆభరణాలను తయారు చేసి ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో జూట్ సంచుల తయారీతో పాటు పుట్టగొడుగుల పెంపకంలోనూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ శిక్షణల్లో పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. వివరాల కోసం కళాశాల లేదా ఆర్ఎస్ఈటీఐ సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, కిషోర్, హరిప్రసాద్, తిరుపతి, ఆర్ఎస్ఈటీఐ కౌన్సిలర్ మహమ్మద్ నజీమ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రక్తదానం.. మరొకరికి ప్రాణదానం..

- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 186 మంది రక్తదానం
- రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- సీపీ సాధన రష్మి పెరుమాళ్




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే స్ఫూర్తితో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 186 మంది పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

**రక్తదానం ప్రాణదానంతో సమానం**

ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి స్మృత్యర్థం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం లభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. రక్తానికి మరో ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారితో పాటు శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలు, ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారికి సహాయం చేయవచ్చని వివరించారు. రక్తదానం చేయడం కేవలం సామాజిక సేవ మాత్రమే కాదని, మానవత్వాన్ని చాటుకునే గొప్ప అవకాశమని సీపీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**రక్తదాతలకు ప్రశంసాపత్రాలు**

సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి విభాగం సమన్వయంతో ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేసిన వారందరికీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, రక్తనిధి విభాగం వైద్యాధికారి డాక్టర్‌శ్రావణి,పోలీస్‌సిబ్బంది,ప్రభుత్వవైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రంగంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**వరంగల్ , అక్టోబర్ 28:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు 11వ డివిజన్ రంగంపేటలోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ సమద్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి--సురేందర్, కార్పొరేటర్‌గా పోటీ చేసిన గన్నారపు కమల్, డివిజన్ కాంగ్రెస్ తాజా మాజీ అధ్యక్షుడు గన్నారపు సంగీత్‌కుమార్, సీనియర్ నాయకులు పులుగం సదానందం, గద్దల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడెపు ఓవర్సీస్‌ను సందర్శించిన రమేష్ పాక



**హనుమకొండ , అక్టోబర్ 28:** హనుమకొండ గ్రీన్ స్క్వేర్ ప్లాజాలోని ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీని తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక సందర్శించారు. ఈ సందర్భంగా కన్సల్టెన్సీ అధినేత ఆడెపు మధుసూదన్ ఆయనకు స్వాగతం పలికారు.
విదేశాల్లో ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అందిస్తున్న మార్గదర్శకత్వం, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ, ఇతర సేవల గురించి రమేష్ పాక అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలు కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు కృషి చేస్తున్న ఆడెపు ఓవర్సీస్ సేవలను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సంస్థ అందిస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమని పేర్కొన్నారు.

# పోలీసు సేవలపై పౌరుల అభిప్రాయ సేకరణ

- సీఐడీలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ ప్రారంభం
- 35 భరోసా కేంద్రాలను అనుసంధానిస్తూ డిజిటల్ కేసు నిర్వహణ వేదిక





**హైదరాబాద్ :** పౌరులకు వృత్తినైపుణ్యంతో కూడిన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ)లో పలు డిజిటల్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పోలీసు సేవల నాణ్యత, సిబ్బంది ప్రవర్తనపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చారు. పోలీసు స్టేషన్లలో రిసెప్షన్ సేవలు పొంది నవారు, ఎఫ్ఐఆర్ నమోదు చేయించినవారు, పాస్‌పోర్టు దరఖాస్తులకు సంబంధించి పోలీసు ధ్రువీ కరణ పూర్తయినవారు, స్పాట్ ఈ--చలాన్లు అందుకున్న పౌరులను ఈ కేంద్రం సిబ్బంది నేరుగా సంప్రదించను న్నారు. ఆయా సందర్భాల్లో అందిన సేవలు, పోలీసుల ప్రవర్తనపై అభిప్రాయాలు సేకరిస్తారు. పౌరులు ప్రస్తావించే సమస్యలను సమీక్షించి, తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

**వేలిముద్రల విశ్లేషణకు సాంకేతిక తోడ్పాటు**

మొత్తం 35 భరోసా కేంద్రాలను అనుసంధానిస్తూ డిజిటల్ కేసు నిర్వహణ వేదికను ప్రారంభించారు. సీఐడీ నూతన వెబ్‌సైట్‌తోపాటు వేలిముద్రల విశ్లేషణను వేగవంతం చేసేందుకు, పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచేందుకు సాంకేతిక ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

**ఐదు సంపుటాలుగా ప్రామాణిక విధానాలు**

పోలీసు సిబ్బందికి దర్యాప్తులో మార్గదర్శకంగా ఉండేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీలు) విడుదల చేశారు. శారీరక దాడులు, ప్రాణహాని సంబంధిత నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు--పిల్లలపై నేరాలు, ప్రత్యేక--స్థానిక చట్టాలు, ఇతర నేరాలకు సంబంధించిన విధానాలను వీటిలో పొందుపరిచారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతోపాటు సిబ్బందికి అవసరమైన సాంకేతిక సాధనాలు, వ్యవస్థలు, మార్గదర్శకత్వం సమకూర్చడంపై ఈ కార్యక్రమాలు దృష్టి సారిస్తున్నాయి.

## మంత్రి పొంగులేటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

**పుష్పగుచ్ఛం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల, ఎమ్మెల్యే నాయిని**



**హైదరాబాద్, అక్టోబర్ 28:** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## అజ్మీరా మంగ్య తండాకు సబ్ పోస్టాఫీస్ కోసం వినతి

**గ్రౌండ్ రిపోర్ట్ తెప్పించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం పోస్టల్ అధికారి అనిల్ కుమార్**



**నెక్కొండఅక్టోబరు 28,** మారుమూల గిరిజన ప్రాంతమైన అజ్మీరా మంగ్య తండాకు సబ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్ కోరారు. తండాలో పోస్టాఫీస్ లేకపోవడంతో గ్రామస్థులు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని రెడ్లవాడ పోస్టాఫీస్‌కు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ మాలోత్ వెంకట్, ఉపసర్పంచ్ అజ్మీరా సుమన్, వార్డు సభ్యులు గటిక అజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అజయ్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో తెలంగాణ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. అనిల్ కుమార్‌ను కలిసి సమ స్యను వివరించారు. తండాకు సబ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలని వినతిపత్రం అంద జేశారు. వినతిపై స్పందించిన అనిల్ కుమార్ క్షేత్రస్థాయి నివేదిక తెప్పించి, సబ్ పోస్టాఫీస్ ఏర్పా టుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజ లకు పోస్టల్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని అజయ్ కుమార్ తెలిపారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలింపు కోసం ఈటల రాజేందర్ పాదయాత్రలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు.



**నమస్తే హైదరాబాద్, అక్టోబర్ 28(కూకట్ పల్లి):** జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర రెండవ రోజు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఎస్‌ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి సంఘీభావం తెలియజేస్తూ, ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొని డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధితుల ఆవేదనను తెలుసుకోవడంలో ఈ పాదయాత్ర కీలకంగా నిలిచింది. రెండవ రోజు పాదయాత్రలో భాగంగా అన్నోజీగూడ, ఘట్కేసర్, యమ్నంపేట్, ఇస్మాయిల్ ఖాన్ గూడ, రాంపల్లి, కరీంగూడ, రాంపల్లి దాయారా, కీసర తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈటల రాజేందర్ కి తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, స్థానికుల జీవన ప్రమాణాలకు సంబంధించిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజల పక్షాన నిలుస్తూ నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొనడం జరిగింది.

# ఎల్‌నినో ప్రభావంతో వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పించాలి

- ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలి
- గ్రామాభివృద్ధికి వీబీ జీ రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వీడియో సమావేశంలో మంత్రి సీతక్క





**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, / సయ్యద్ జహీర్ / అక్టోబర్ 28 (నమస్తే హైదరాబాద్):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. గ్రామీణ ప్రజలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లోనే కొత్త పనులను గుర్తించి ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు, సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మంత్రి సీతక్క, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్‌లు అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సర్పంచులు, ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడం, వీబీ జీ రాంజీ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ కూలీలకు పని దొరకడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పథకం కింద చేపట్టే పనులతో సీసీ రహదారులు, పాఠశాల భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాలు, గోదాములు, సామాజిక భవనాలు వంటి నిర్మాణాలను చేపట్టవచ్చని వివరించారు.

**గ్రామసభల్లో పనులను గుర్తించాలి**

వీబీ జీ రాంజీ పథకం కింద 375 రకాల పనులు అందుబాటులో ఉన్నాయని, వాటిపై సర్పంచులకు అవగాహన కల్పించి పనిదినాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. మంజూరైన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పథకం కింద చేపట్టిన పనులకు పది రోజుల్లోనే నగదు ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్న మంత్రి, నిధుల చెల్లింపులపై ఆందోళన చెందకుండా పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలని సర్పంచులకు సూచించారు.

**ఆదర్శ గ్రామాలకు కోటి రూపాయల ప్రోత్సాహకం**

గ్రామాల్లో అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకునేందుకు వీబీ జీ రాంజీ పథకం మంచి అవకాశమని మంత్రి పేర్కొన్నారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన గ్రామానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా కోటి రూపాయల నిధులు అందజేస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**పశువులకు నీటి వసతి, పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహం**

గ్రామాల్లో పశువులకు తాగునీటి కొరత లేకుండా నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. రైతులు లేదా గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పశుగ్రాసం సాగు చేపడితే ఎకరానికి రూ. 14 వేల చొప్పున ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని వివరించారు. ఈ సహాయంతో పాటు సాగు చేసిన పశుగ్రాసాన్ని విక్రయించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమేష్, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.





**వేలేరు, అక్టోబర్ 28, నమస్తే హైదరాబాద్::** హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడశపల్లి గ్రామంలో ఈ రోజు జరిగిన సమావేశంలో వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాల పట్టభద్రుల ఎమ్ఎల్సీ ఎన్నికల ఓటరు నమోదు సన్నాహక సమావేశం జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యం నిర్వహించారు సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా మార్చింది కాంగ్రెస్సేనని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతున్న పరాజయాలు ఆ పార్టీ పతనానికి సంకేతమని, తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రస్థానం ముగిసే రోజులు దగ్గరపడ్డాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మూడేళ్ల క్రితం తెలంగాణ ఎట్లా ఉండేది, ప్రస్తుతం ఎట్లా ఉందో పట్టభద్రులు గమనించి ఓటు వేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడాశపల్లిలో బుధవారం వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు మండలాలకు సంబంధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణలో సాగునీటి రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం పంటలకు సాగునీరు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు మండలాల ప్రజల ఓట్లతోనే కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందారని పేర్కొన్న పల్లా.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదవులు అనుభవించి, అనంతరం పార్టీకి నమ్మకద్రోహం చేశారని ఆరోపించారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాలు తనకు రెండు కళ్లలాంటివని, ఈ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

# ఉద్యోగాల పేరుతో మోసం చేసిన రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి.. మీ ఓటుతోనే ప్రభుత్వానికి సమాధానం చెప్పాలి మాజీ మంత్రి వర్యులు
- ఎర్రబెల్లి దయాకర్ రావు





**జనగామ జిల్లా దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్ )** దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్ లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు - ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఆయుధం. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి, రైతులకు సాగునీరు, ప్రజలకు సంక్షేమం అందించడంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందో ప్రజలు ప్రశ్నించాలి. ప్రశ్నించే గొంతుకకు ఓటే బలం. ప్రభుత్వ పనితీరును అంచనా వేసి, ప్రజాసమస్యలపై తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేసే అవకాశం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కల్పిస్తాయి. పట్టభద్రులందరూ ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులో తమ పేరును నమోదు చేసుకోవాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలి. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంది. పట్టభద్రుల సమస్యలను మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలంగా వినిపించేలా ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు- ఈ కార్యక్రమంలో, జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, కొత్త జలంధర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మల్లేష్, ఏల సుందర్, కారు పతుల బిక్షపతి, కోతి ప్రవీణ్, వీరారెడ్డి దామోదర్ రెడ్డి, కాశీం, ఆలకుంట్ల యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు,

# ఎండలు మండుతున్నాయి - ఆర్టీసీ ఏసీ సర్వీసులు పెంచాలని ప్రయాణికుల డిమాండ్

**హైదరాబాద్:**ఎల్?నినో ప్రభావంతో కరవు, ఎండల తీవ్రత పెరుగుతుండటంతో వ్యవసాయ రంగంతో పాటు ఆర్టీసీ బస్సులపై ప్రభావం చూపుతోంది. ప్రతి ఏటా ఈ సమయానికి చలిగాలులు మొదలవ్వాలి. కానీ ఎండల తీవ్రతతో ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. మరి ముఖ్యంగా ఐటీ ఉద్యోగులతో పాటు, సాధారణ ప్రయాణికులు సైతం ఏసీ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్?లో 90కి పైగా ఏసీ బస్సులు (పుష్పక్ బస్సులతో కలిపి) నడుపుతుండగా మరిన్ని సర్వీసులు నడపాలంటూ ప్రయాణికులు కోరుతున్నారు.పెరుగుతున్న ఉష్ణోగ్రతఅక్టోబరు నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు ఎల్నినో ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఆర్టీసీ గతంలో ప్రవేశపెట్టిన 30 శాతం టికెట్ ధరలు తగ్గింపుతో ఆక్యుపెన్సీ 60 శాతం నుంచి 85 శాతానికి పెరిగింది. ఏసీ బస్సుల్లో ఈ పథకం వర్తింపజేస్తే ఎక్కువ మందిని ఆకర్షించే వీలుంటుంది.రద్దీకి సరిపోని ఆర్టీసీ బస్సులుగచ్చిబౌలి, హైటెక్? సిటీ, మాదాపూర్ వైపు ప్రయాణించే టెక్కీలు ట్రాఫిక్ ఇబ్బందులు, ఉక్కపోత నుంచి తప్పించుకోవడానికి ఎలక్ట్రిక్ ఆధారిత ఈ-మెట్రో ఏసీ బస్సులనే మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నారు.



ప్రస్తుతం నగరంలో 90కిపైగా ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు ఎయిర్పోర్టు లైనర్లతో కలిపి, 275కి పైగా మెట్రో డీలక్స్ బస్సులు నిత్యం 1000కి పైగా ట్రిప్పులు నడుపుతున్నా రద్దీకి అవి సరిపోవడం లేదు.ఏసీ బస్సులు సంఖ్య పెంచాలని డిమాండ్ప్రస్తుతం కోఠి, సికింద్రాబ్, దిల్సుఖ్నగర్ శివార్ల నుంచి ఐటీ కారిడార్?కు కనెక్ట్? అయ్యే రూట్లలో ఏసీ బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్యాలయాలు, విద్యాసంస్థల సమయాల్లో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలో శివారు ప్రాంతాల నుంచి ఐటీ జోన్లకు నేరుగా ఒకే బస్సు ఉండేలా సర్వీసులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఏసీ బస్సుల సంఖ్యను పెంచాలని ఐటీ ఉద్యోగులు చెబుతున్నారుట్యాంకర్లు నిండిన తర్వాత అదనంగా మిగిలే నీరు వృథా కాకుండా, దాన్ని తిరిగి సమీపంలోని చెరువుకు మళ్లించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు.ఈ గ్రీన్ వాటర్ అనేది తాగునీటికి ప్రత్యామ్నాయం కాదని, కేవలం తాగడానికి అవసరం లేని పనులకు మాత్రమే వినియోగించాలని జలమండలి అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్లపై దుమ్ము నియంత్రణ, పార్కులు, హరితహారం మొక్కల సంరక్షణ వంటి పనులకు ఈ నీటిని ఉపయోగించేలా ప్రజలను, సంస్థలను ప్రోత్సహించనున్నారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు.. కీలక శాఖలకు కొత్త అధికారులు




**హైదరాబాద్, అక్టోబర్ 28:** తెలంగాణ ప్రభుత్వం పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జయేష్ రంజన్‌కు పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించగా.. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ, ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడలు, హెరిటేజ్ తెలంగాణ బాధ్యతలు కేటాయించింది. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించగా, కె. ఇలంబర్తిను రవాణా శాఖ కార్యదర్శిగా నియమించింది.ఇతర మార్పుల్లో భాగంగా సర్ఫరాజ్ అహ్మద్‌కు జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. శృతి ఓజాకు మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల బాధ్యతలు కేటాయించారు. ముషర్రఫ్ అలీ ఫారూఖీకి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించగా, డాక్టర్ సంగీత సత్యనారాయణను మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. జితేష్ వి. పాటిల్‌కు టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఆర్ఈడీసీఓ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేరుతో ఉత్తర్వులు విడుదలయ్యాయి.

# హైదరాబాద్‌లో దుర్గామాత ఊరేగింపుపై కోడిగుడ్ల దాడి.. కేసు నమోదు



**హైదరాబాద్, అక్టోబర్ 28:** మాదన్నపేటలో దుర్గామాత ఊరేగింపుపై కోడిగుడ్లతో దాడి చేసిన ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 25న దుర్గామాత ఊరేగింపు జరుగుతున్న సమయంలో ఓ ఇంటి నుంచి కోడిగుడ్లు పడినట్లు అశ్విన్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హౌస్ నంబర్ 17-2-714/13 నుంచి కోడిగుడ్లు పడినట్లు ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మదన్నపేట పోలీసులు 196(2), 299 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.మరోవైపు.. మదన్నపేట పోలీస్ స్టేషన్‌లో యాకుత్‌పుర ఎమ్మెల్యే హంగామా చేసినట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. విచారణ నిమిత్తం పోలీసులు తీసుకొచ్చిన నలుగురు అనుమానితులను ఎమ్మెల్యే బలవంతంగా వెంట తీసుకెళ్లినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల దర్యాప్తునకు ఆటంకం కలిగించడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేసు విచారణలో ఉన్న అనుమానితులను ఎమ్మెల్యే ఎలా తీసుకెళ్తారని ప్రశ్నిం చాయి. ఈ పరిణామాలతో కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందనే అంశంపై చర్చ జరుగు తోంది. అయితే.. ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసుల అధికారిక స్పందన తెలియాల్సి ఉంది.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది : కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

**హైదరాబాద్ :** మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్ కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తా రని ప్రశ్న మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండి పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జె న్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శిం చారు. హైదరా బాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం



చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. “కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది” అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# మేడి అఖిల్ హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

**లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 28 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామానికి చెందిన మేడి అఖిల్ హత్య కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు టెక్నికల్ టీమ్ సహకారంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించి కేసును ఛేదించినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడిం చారు. నమ్మదగిన సమాచారం మేరకు లక్ష్మీదేవి పల్లి ఎస్ఐ అఖిల తన సిబ్బందితో కలిసి కొత్త గూడెం బస్టాండ్ సమీపంలో నిందితులు దం త్యాల గణేష్ అలియాస్ గని, సిరిపురం సాత్విక్ అలియాస్ చిన్ను, ముద్దంగుల వెంకటేష్ అలియాస్ చిన్ని, తరాల ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. గతంలో జరిగిన గొడవలు, వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ప్రధాన నిందితులుగా పేర్కొన్న గణేష్, సాత్విక్‌లు అఖిల్‌పై పగ పెంచుకుని హత్యకు పథకం రచించారు. ఇందులో భాగంగా మద్యం తాగిస్తామని నమ్మించి అఖిల్‌ను ఎదురుగడ్డ గ్రామంలోని రేకుల షెడ్డు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి



తీసుకెళ్లారు. 19.10.2026 తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో గణేష్ కత్తితో అఖిల్ మెడపై పలుమార్లు పొడిచి, సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేయగా, సాత్విక్ కూడా సిమెంట్ ఇటుకతో దాడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడిలో అఖిల్ మృతి చెందాడు. ఈ హత్యకు సంబంధించి మిగిలిన నిందితులు సైతం ముందస్తు పథకంలో భాగంగా సహకరించినట్లు, మద్యం కొనుగోలు తదితర అవసరాల కోసం ఫోన్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు విచారణలో గుర్తించారు. నిందితుల వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, ఫోన్ పే లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను పోలీసులు రికవరీ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. వ్యక్తిగత కక్షలు, పాత గొడవల కారణంగా హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని నేరాలకు పాల్పడవద్దని, సమస్యలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతకాలం పరారీలో ఉన్నా సాంకేతిక ఆధారాలు, పోలీసుల దర్యాప్తు ద్వారా గుర్తించి చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.ఈ కేసులో నిందితుల పాత్ర, ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో టెక్నికల్ టీమ్ సహకారం కీలకంగా నిలిచిందని డీఎస్పీ పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన బంజారాహిల్స్ ఎస్ఐ

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికా రులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయా డు. ఓ కేసులో సహాయం చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆయనపై ఆరోప ణలు ఉన్నాయి.వివరాల్లోకి వెళితే.. బం జారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్, ఓ ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐ విజయ్‌ను పట్టుకున్నారు.పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడంతో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు వెంటనే ఎస్ఐ విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తమ కార్యాలయానికి తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.




# ఈ నెలాఖరున దాన కిశోర్ పదవీ విరమణ.. గవర్నర్ స్పెషల్ సీఎస్‌గా పునర్నియామకం



**హైదరాబాద్:**తెలంగాణ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిశోర్‌ను గవర్నర్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది.1996 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాన కిశోర్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన సేవలను పదవీ విరమణ అనంతరం కూడా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు జీఏడీ జీఓ ఆర్టీ నంబర్ 1554ను విడుదల చేసింది.ప్రస్తుతం గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న దాన కిశోర్‌ను అదే పదవిలో పునర్నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# అర్నబ్ తుపాను ఎఫెక్ట్: తెలంగాణకు భారీ వర్ష సూచన.. రైళ్లు, విమానాల రద్దు

**హైదరాబాద్:**అర్నబ్ తుపాను ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తెలంగాణలోని 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ శంషాబాద్ నుంచి పలు విమాన సర్వీసులు రద్దు
దక్షిణ మధ్య రైల్వే 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటన
ప్రయాణికులు రైళ్ల సమాచారం తెలుసుకోవాలని అధికారుల సూచన అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో జనజీవనంపై ప్రభావం పడుతోంది. తెలంగాణలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.తుపాను కారణంగా రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ, విశాఖపట్నం వెళ్లాల్సిన పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తుపాను పరిస్థితుల కారణంగానే విమానాలను రద్దు చేసినట్లు జీఎంఆర్



వర్గాలు ప్రకటించాయి. ఈ పరిస్థితి మరో రెండు రోజుల పాటు కొనసాగవచ్చని విమానాశ్రయ అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు, దక్షిణ మధ్య రైల్వే కూడా అప్రమత్తమైంది. కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహి ంచారు. ముందుజాగ్రత్త చర్యగా 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రద్దయిన రైళ్లలో ఫలక్‌నుమా, గోదావరి, విశాఖ, గౌతమి, కోకనాడ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైళ్ల ప్రస్తుత స్థితిని ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వంటి అధికారిక యాప్‌లలో సరిచూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

# ఏఐ ప్రమాదకరం

## : డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం



ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి



విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.

ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

# 'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫీలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు.అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.




# లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..




భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. ""రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు.మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు.ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## సందీప్ కిషన్ 'పవర్ పేట'..

# 'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..



యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు.విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది.'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.

Printed Published and Owned by Godishala Somaiah Published from H.No 15-76 (V&M)Medipally,(Dist) Medchal Malkajgiri - 500098. Printed at Sree Sesha Sai Enterprises,Plot no 19, IDA Balanagar, Hyderabad Editor: Godishala Somaiah,email: nhnews24@gmail.com ,ph : 9912580066 RNI APTEL/2012/45237